| Date | Publication | Headline | Edition |
|---|---|---|---|
| May 6, 2015 | Eenadu | India's per capita retirement, pension assets lowest in world | Mumbai |

# మన పింఛను ఆదాయం ప్రపంచంలోనే తక్కువ

- పింఛను ఆస్తులదీ ఇదే తీరు
- పదవీ విరమణ అనంతర స్థితి ఇదీ
- ఆర్ క్యామ్ నివేదిక



**ముంబయి:** పదవీ విరమణ అనంతరం లభించే తలసరి పింఛనుతో పాటు పింఛను రూపంలో పొందే ఆస్తులు దేశ జీడీపీతో పోలిస్తే, ప్రపంచంలోనే అత్యంత తక్కువగా ఉన్నాయని రిలయన్స్ క్యాపిటల్ అసెట్ మేనేజ్‌మెంట్ (ఆర్ క్యామ్) సర్వే వెల్లడించింది. ఐఎంఆర్‌బీ ఇంటర్నేషనల్ (గతంలో ఇండియన్ మార్కెట్ రీసెర్చ్ బ్యూరో)తో కలిసి దేశవ్యాప్తంగా ఈ సర్వే చేసినట్లు తెలిపింది. ముఖ్యాంశాలివీ..

- దేశ జీడీపీలో పింఛను ఆస్తుల వాటా 15.1 శాతమే ఉంది. ఇది జర్మనీలో 21 శాతం, బ్రెజిల్‌లో 41 శాతం, అమెరికాలో 78.9 శాతం కాగా, ఆస్ట్రేలియాలో అత్యధికంగా 146 శాతం ఉంది.
- దేశంలో 30 ఏళ్ల వారు అధికంగా ఉన్నారు. 60 ఏళ్లు పైబడిన వారు 10 కోట్ల మంది ఉంటారు. 2050 నాటికి వీరి సంఖ్య 30 కోట్లకు చేరుతుంది.
- పదవీ విరమణ అనంతరం జీవనం సుఖంగా సాగేందుకు ఆర్థికంగా జాగ్రత్త పడదామనే అత్యధికులు భావిస్తున్నారు. సొంతిల్లు సమకూర్చుకోవడం, పిల్లల విద్య, వివాహానికి తోడు ఈ ప్రణాళికపైనా అప్రమత్తంగా ఉన్నారు.
- 30-40 ఏళ్ల మధ్య ఉన్న వారితో పాటు 41-55 ఏళ్ల వారు కూడా పదవీ విరమణానంతర జీవితానికి తగిన ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసమే రిటైర్‌మెంట్ పథకాలను కొనుగోలు చేస్తున్నారు. 30-40 ఏళ్ల వారు ఎక్కువగా ఈ పథకాల్లో పెట్టుబడి పెడుతున్నారు.
- ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల ప్రజలు ద్రవ్యోల్బణ ప్రభావంతో ధరల పెరుగుదలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదవీ విరమణ చేశాక, సుఖమయ జీవనానికి అనుగుణంగా మదుపు చేయాలని భావిస్తున్నారు.
- పదవీ విరమణ అనంతర జీవనం కోసం 40 ఏళ్లు వచ్చాక, పొదుపు మొదలు పెడతామని 60 శాతం మంది తెలిపారు.

**జాగ్రత్త పడాలి:** వృద్ధుల సంఖ్య ఇప్పుడు తక్కువగా ఉన్నా, మూడున్నర దశాబ్దాల్లో మూడింతలు కానుందని, అందువల్ల పదవీ విరమణ అనంతర జీవితానికి ఇప్పటినుంచే ప్రణాళిక రూపొందించకపోతే ఇబ్బందులు తప్పవని ఆర్ క్యామ్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి హిమాంశు వ్యాపక్ తెలిపారు.